క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం పంచాయతీ సర్పంచ్ డోల తిరుపతిరావు తండ్రి మాజీ సర్పంచ్ డోల రాములు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం పరామర్శించారు. రాములు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్మోహనరావు, మాజీ సర్పంచ్ మంగరాజు కామినాయుడు, ఎన్ని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



అంబకండిలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

రేగిడి: మండలంలోని అంబకండి, వావిలవలస తదితర గ్రామాల్లో చేపడుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి బుధవారం తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న రైతుల వివరాలు, సర్వే నంబర్లు, పొలంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించి ఆయా వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్ల నుంచి వివరాలు సేకరించారు. ఈ-క్రాప్ నమోదులో తప్పులు లేకుండా చూడాలని, సకాలంలో పూర్తిచేయాలని సూచించారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

తెర్లాం: ప్రతీ ఒక్కరూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులకు సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రం వద్ద కార్యకర్తలు వై.శ్రీదేవి, లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ విద్యార్థులకు చేతుల శుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుగుకోవాలని సూచించారు. చేతులు ఏవిధంగా శుభ్రం చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరావు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విషజ్వరాల నియంత్రణకు చర్యలు

రాజాం: పట్టణంలో విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని వాసవీనగర్, బాబానగర్, ఈశ్వరనారాయణ కాలనీల్లో బుధవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురుగుకాలువల్లో మెలాథీన్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. పట్టణవాసులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సత్కరిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: పట్టణంలోని వాసవీనగర్‌లో నిర్వహిస్తున్న గణేశ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం కురుక్షేత్రం నాటకం నుంచి మయసభ పడక సన్నివేశాన్ని ప్రదర్శించారు. రాజాం ఉదయభాను కళా సమితి నిర్వహించిన ఈ ప్రదర్శనలో శ్రీకృష్ణుడిగా అమరావు కృష్ణమూర్తి, అర్జునుడిగా శివరామినాయుడు, దుర్యోధనుడిగా నంది అవార్డు గ్రహీత అప్పన్నదొర నటించి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా కళాకారులను వాసవీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాలవలస శ్యామ్‌సుందరరావు, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మక్క అప్పలనాయుడు, టి.శ్రీను, యు.ఉమామహేశ్వరరావు, అచ్యుతరావు, బి.నారాయణరావు, కె.శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

30లోగా ఫీజు చెల్లించాలి

సంతకవిటి: ఇంటర్మీడియట్‌లో 2022-2023 విద్యా సంవత్సరంతో పాటు అంతకుముందు ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.జనార్దనరావు తెలిపారు. అలాగే మధ్యలో చదువు నిలిపివేసిన విద్యార్థులు కూడా ఫీజు చెల్లించి పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఫీజు చెల్లించిన వారంతా 2024 మార్చిలో జరిగే పరీక్షలు రాసేందుకు అర్హులుగా పేర్కొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా..

- 'జగనన్న ఆరోగ్య సురక్ష' అమలు
- గ్రామాల్లో చురుగ్గా కొనసాగుతున్న సర్వే



బాడంగి: బొత్సవానివలసలో ఇంటింటి సర్వే చేస్తున్న వలంటీర్లు



రామభద్రపురం: బూసాయవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు

రామభద్రపురం: పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం అమలు చేస్తోందని తహసీల్దార్ రాజారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. వలంటీర్లు తమ క్లస్టర్‌లోని ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఏఎన్‌ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ నెల 30 నుంచి సచివాలయాల వారీగా వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

● బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ ఇంటినీ సర్వే చేయాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం తనిఖీ చేశారు. సర్వే ఎందుకు చేస్తున్నారో ప్రజలకు తెలియజేయాలని, సేకరించిన వివరాలను యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచించారు.



రాజాం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

● బాడంగి: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. వలంటీర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. వారికి ఈ నెల 30 నుంచి నిర్వహించే వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందజేయనున్నారు. ఆరోగ్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, ఎంఎల్‌ఓ నాయుడు కోరారు.



బొబ్బిలి: సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు

● రాజాం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని శ్యాంపురం గ్రామంలో చేపట్టిన సర్వేను బుధవారం పరిశీలించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్ధేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భవ'తో వైద్యసేవలు విస్తృతం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

● ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పేద ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ఆయుష్మాన్ భవ' ఆరోగ్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్య సేవలను విస్తృతం చేసేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైద్యాధికారి జి.శశిభూషణరావు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసేవలు



దేవుదల అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న వైద్యసేవలు

రేగిడి: మండలంలోని రేగిడి, బూరాడ పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా వైద్యతనిఖీలు నిర్వహిస్తున్నామని డాక్టర్ అసిరినాయుడు తెలిపారు. మండలంలోని దేవుదళ, బూరాడ, ఉంగరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు అమలు చేయాలి

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ, పెన్షన్ చెల్లించాలనే సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘ నాయకులు జె.కామేశ్వరి, ఉమాగౌరి, ఎస్.కామేశ్వరి, బి.నిర్మల తదితరులు వాపోయారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు తదితరులతో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డీపట్టా భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషశైలజ, రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో ఉన్న డీపట్టా భూములు ఆర్డీఓ పి.శేషశైలజ బుధవారం పరిశీలించారు. 22 ఏ జాబితాలో ఉన్న భూముల వివరాలను తహసీల్దార్ డోల రాజేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. 22 ఏ జాబితాలో ఉన్న డీపట్టా భూముల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా..



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రఫీజాన్

బాడంగి: ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని తహసీల్దార్ అజురఫీజాన్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో బుధవారం సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒకే డోర్ నంబరులో పది మందికంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వారికి కొత్త డోర్ నంబర్లు కేటాయించాలని, డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లయితే వారి విల్లింగ్ తీసుకుని రెండో ఓటును జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో హెచ్‌డీటీ చిన్నం నాయుడు, ఆర్‌ఐ సోమన్న, డీఈఓ విజయ్ పాల్గొన్నారు.

అక్కినేనికి ఘన నివాళి



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాక్రియేషన్స్ సభ్యులు

రాజాం సిటీ: దాదాసాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత, సినీ నటుడు స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావుకు కళాక్రియేషన్స్ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం అక్కినేని శతజయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. సినీ రంగానికి, సమాజానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కళాక్రియేషన్స్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, తృప్తి రిసార్ట్ అధినేత పీవీజీకే రాజు (మురళీ మాస్టార్), గంపల సూర్యం, పెంకి చైతన్యకుమార్, యూఎస్ యాదవ్, పాలవలస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా భూముల రీసర్వే



వన్నలిలో భూముల రీసర్వే చేస్తున్న సర్వే సిబ్బంది

రేగిడి: మండలంలో వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లో భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోంది. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ సర్వే చేస్తున్నామని తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి తెలిపారు. వన్నలి గ్రామంలో చేపట్టిన సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. భూముల సమగ్ర రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. దగ్గరుండి తమ భూములను రైతులు సర్వేచేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి



డీసీసీబీ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న సంకిలి పీఏసీఎస్ చైర్మన్, తదితరులు

రేగిడి: మండలంలో సంకిలి ప్రభుత్వ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కొత్త భవనాన్ని నిర్మించాలని సొసైటీ చైర్మన్ లావేటి వెంకటవేణుగోపాలనాయుడు శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావును కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంకిలి పీఏసీఎస్ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలో నడుస్తోందని, 2013లో 20 సెంట్లు భూమి కేటాయించారని గుర్తుచేశారు. కానీ ఇంతవరకు పక్కా భవనం నిర్మించకపోవడంతో సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బందులకు గురౌతున్నారని వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి భవన నిర్మానానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కేంద్రం సీఈఓ వరప్రసాదరావు, లక్ష్మీపురం, అప్పాపురం సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, లావేటి గణపతిరావునాయుడు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

రేగిడి: మండలంలోని ప్రతీ రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీని బుధవారం ఆయన పరిశీలించారు. రైతులు పండించిన పంటను రైతుభరోసా కేంద్రాలకు విక్రయించాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ ఉండాలని సూచించారు.



వన్నలిలో రైతులతో ఈకేవైసీ చేయిస్తున్న అధికారులు

అర్హులందరికీ 'జగనన్న చేదోడు'



జగనన్న చేదోడు పథకంపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ

తెర్లాం: జగనన్న చేదోడు పథకాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరికి వర్తింపచేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న చేదోడు పథకం అమలుపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల నుంచి 790 మందికి జగనన్న చేదోడు పథకం అందుతోందని, ఈ ఏడాది కొత్తగా 49 మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కొత్తగా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులకు పథకం అందేలా చూడాలన్నారు. అలాగే గత ఏడాది చేదోడు పథకం వర్తించిన లబ్ధిదారుల వివరాలను మరోసారి పునఃపరిశీలన చేయాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ పథకం అందలేదనే విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చూడండి

తెర్లాం: జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ బొబ్బిలి డీఈఈ పలగర అప్పయ్య, తెర్లాం ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు, ఇంకుడు గుంతల నిర్మాణాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయాల వారీగా మంజూరైన ఇళ్లు, ఇప్పటివరకు పూర్తయిన ఇళ్ల వివరాలపై ఆరాతీశారు. జగనన్న ఇళ్ల లేఅవుట్లలోను, సొంత స్థలాల్లోను ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నిర్మాణం పూర్తయిన ప్రతీ ఇంటి వద్ద ఇంకుడు గుంతను నిర్మించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. గృహాలు నిర్మిస్తున్న వారికి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి స్టేజ్ అప్‌డేషన్ చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ ఆనందకుమార్ తదితరులు ఉన్నారు.

రక్తహీనత నివారణే లక్ష్యం



ఎస్.సీతారాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రాజ్యలక్ష్మి

రామభద్రపురం: రక్తహీనత నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తోందని సీడీపీఓ రాజ్యలక్ష్మి అన్నారు. వైఎస్సార్ పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహార వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్థకమైన ఆహారాన్ని అందిస్తోందని, రక్తహీనతను నివారించి ఆరోగ్యాన్ని పెంచేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.సీతారంపురం సర్పంచ్ యమున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పార్కు పనులు వేగవంతం చేయాలి



వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పట్టణంలో బొబ్బిలి జంక్షన్ వద్ద ఉన్న యర్రవాని చెరువు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం పరిశీలించారు. రూ.1.03 కోట్లతో చెరువును పార్కుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఏఈ పి.వెంకట్ వద్ద వివరాలు సేకరించారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తిచేసి పార్కు ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, యూత్ కన్వీనర్ వంజరాపు విజయ్‌కుమార్, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఏఈ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అభివృద్ధి పనులపై ఆరాతీస్తున్న కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు

బొబ్బిలి: 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు బుధవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జీజీఎంపీ నిధులతో మున్సిపాలిటీ పరిధిలో రూ.3.20 కోట్ల విలువైన 80 పనులు మంజూరయ్యాయి. వాటిలో ప్రస్తుతం సుమారు కోటిన్నరకు పైగా విలువైన 42 పనులు పూర్తయినట్టు చెప్పారు. మిగతా పనులు 15 రోజుల్లో పూర్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సహస్ర పారాయణం



రాజాం సిటీ: పారాయణం చేస్తున్న జైశ్రీమన్నారాయణ గ్రూపు సభ్యులు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని కేర్ జంక్షన్ వద్ద ఉన్న ధన్వంతరి విద్యాగణపతి ఆలయంలో బుధవారం సహస్ర పారాయణం చేపట్టారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జైశ్రీమన్నారాయణ గ్రూపు సభ్యులు గణపతి నవరాత్రులను పురస్కరించుకుని సహస్ర పారాయణం చేపట్టారు.

మల్లంపేటలో వినాయకునికి పాలాభిషేకం

బొబ్బిలి: పట్టణంలోని మల్లంపేటలో ఏర్పాటైన వినాయక మంటపంలో బుధవారం స్వామికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక యువత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

రేగిడి: మండలంలో తాటిపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు బుధవారం తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ఆరాతీశారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు పాలూరి రామకృష్ణ, కుప్పిలి రమేష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో లింగాలవలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం దాసరి కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.